ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 2 | సంచిక: 240 | పేజీలు: 4 వెల: రూ.3/- | శుక్రవారం 6 డిసెంబర్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

# ఇందిరమ్మ ఇండ్లను
# ప్రాధాన్యత క్రమంలో కేటాయిస్తాం




- అత్యంత నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత
- వారికి మొదటగా ఇండ్ల కేటాయింపు
- ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇండ్ల కేటాయింపు
- మొత్తంగా 4.50 లక్షల ఇండ్ల నిర్మాణం
- ఒక్కో ఇంటికి రూ. 5 లక్షల చొప్పున నిధులు
- పరిపాలనా అనుమతులు కూడా ఇచ్చేశాం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి
- లబ్దిదారుల ఎంపిక ప్రత్యేక మొబైల్ యాప్
- ఎంపికపై ప్రభుత్వం కీలక నిర్ణయం
- సచివాలయంలో యాప్‌ను ఆవిష్కరించిన సీఎం

**హైదరాబాద్, డిసెంబర్ 5 (ప్రభాత ఉదయం):** ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అందుకే లబ్ధికారుల ఎంపికపై ఎలాంటి విమర్శలు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తోంది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను జోడించి ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. గురువారం తెలంగాణ సచివాలయంలో ఈ యాప్‌ను ఆవిష్కరించారు. ఇండ్ల లబ్ధికారుల ఎంపికపై సీఎం రేవంత్ క్లారిటీ ఇచ్చారు. దీనికి సంబంధించిన 10 ముఖ్యమైన అంశాలు విధించారు. ఇందిరమ్మ ఇండ్ల లక్ష్యం ఎంత గొప్పదైనా.. అమలులో లోపాలుంటే ప్రభుత్వంపై విశ్వసనీయత దెబ్బతింటుంది. పేదవారికి అన్యాయం జరుగుతుంది. అందుకే సాంకేతిక నైపుణ్యాన్ని జోడించి ఇళ్లు అనర్హులకు చెందకూడదని ప్రత్యేకంగా యాప్ అందుబాటులోకి తెచ్చామని రేవంత్ రెడ్డి వివరించారు. ఇందిరమ్మ ఇండ్లను ప్రాధాన్యత క్రమంలో కేటాయిస్తామని.. అత్యంత నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత కింద ఇండ్ల కేటాయింపు జరుగుతుందని సీఎం స్పష్టం చేశారు. ముఖ్యంగా దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, వ్యవసాయ కూలీలు, పారిశుద్ధ్య కార్మికులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్స్... ఈ క్రమంలో ప్రాధాన్యత ఇస్తూ ఇండ్లను కేటాయిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. లబ్ధిదారులు తమకున్న స్థలాన్ని గరిష్టస్థాయిలో వినియోగించుకుని నిర్మించుకునేలా.. ప్రతి మండల కేంద్రంలో ఒక నమూనా ఇంటిని నిర్మించి చూపిస్తామని ..మిగతా 2లో



## మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా
# ఫడ్నవీస్ ప్రమాణం
### ప్రధాని మోదీ సమక్షంలో ప్రమాణ స్వీకారం
### డిప్యూటీలుగా షిండే, అజిత్ పవార్ ప్రమాణం

**ముంబై, డిసెంబర్ 5 (ప్రభాత ఉదయం):** ముంబైలోని ఆజాద్ మైదానంలో గురువారం జరిగిన భారీ కార్యక్రమంలో దేవేంద్ర ఫడ్నవీస్ మూడోసారి మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ తో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఫడ్నవీస్ కు ఇది మూడోసారి. ఆజాద్ మైదానంలో జరిగిన కార్యక్రమంలో దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్యమంత్రిగా శివసేన చీఫ్ ఏక్ నాథ్ షిండే, ఎన్సీపీ నేత అజిత్ పవార్ కూడా మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇతర మంత్రులు ఎప్పుడు ప్రమాణ స్వీకారం చేస్తారనే ప్రశ్నకు బీజేపీ (%ఎయిజూ%) నేత సుధీర్ ముంగంటివార్ సమాధానమిస్తూ.. అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభానికి ముందే కొత్త మంత్రివర్గం ఏర్పాటు అవుతుందన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన మహాయుతి కూటమిలోని పార్టీల మధ్య రెండు వారాల తీవ్ర చర్చల తర్వాత కొత్త ప్రభుత్వ ఏర్పాటు జరిగింది. ఇటీవలి మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మిత్రపక్షాలైన శివసేన, ఎన్సీపీలతో కలిసి బీజేపీ నేతృత్వంలోని మహాకూటమికి 230 సీట్లు సాధించింది. బీజేపీ ఒంటరిగా 132 సీట్లు గెలుచుకుంది.మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడణవీస్ ప్రమాణ స్వీకారానికి పలువురు సినీ, రాజకీయ, వ్యాపార, క్రీడా రంగ ప్రముఖులు హాజరయ్యారు. వారిలో పలువరు కేంద్ర మంత్రులు, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, బిహార్ సీఎం నితీశ్ కుమార్, పలువురు బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఉన్నారు. అలాగే, బాలీవుడ్ నుంచి షారూఖ్ ఖాన్, సల్మాన్ ఖాన్, సంజయ్ దత్, మాధురి దీక్షిత్, క్రికెటర్ సచిన్ టెండూల్కర్, ప్రముఖ వ్యాపారవేత్త కుమార మంగళం బిర్లా కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రముఖ వ్యాపారవేత్త, రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ సకుటుంబ ..మిగతా 2లో



# మాజీ మంత్రి హరీష్ రావు అరెస్ట్
### హరీష్‌తో పాటు కౌశిక్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు
హరీశ్‌రావును గచ్చిబౌలి పీఎస్‌కు తరలింపు

ఇది ప్రజాస్వామ్య పాలన కాదు.. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి రాక్షస పాలన..!

ప్రశ్నిస్తే కేసులు, నిలదీస్తే బెదిరింపులు.. రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగిన హరీశ్‌రావు

ప్రభుత్వ తప్పులపై ప్రశ్నిస్తే కేసులా..? మా నాయకుల అరెస్టులు అప్రజాస్వామికం..

తక్షణం విడుదల చేయాలి.. రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ ధ్వజం

**హైదరాబాద్, డిసెంబర్ 5 (ప్రభాత ఉదయం):** మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు హరీష్ రావును పోలీసులు అరెస్ట్ చేశారు. బంజారాహిల్స్‌లో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని పరామర్శించడానికి వెళ్లిన సమయంలో పోలీసులు ఆయన్ని అడ్డుకున్నారు. బలవంతంగా అదుపులోకి తీసుకుని గచ్చిబౌలికి తరలించారు. హరీష్ రావును ఎందుకు అదుపులోకి తీసుకున్నారనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై హరీష్‌రావుపై కేసు నమోదైంది. పాడి కౌశిక్ రెడ్డి ఇంటికి వెళ్లిన సమయంలో అడ్డుకుని అదుపులోకి తీసుకోవడంతో గందరగోళం నెలకొంది. పోలీసులు వాహనంలోకి ఎక్కే ముందు హరీష్ రావు తీవ్రంగా ప్రతిఘటించారు. బంజారాహిల్స్‌లోని కౌశిక్ రెడ్డి నివాసానికి పెద్ద ఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు చేరుకుంటున్నారు. హ?రీశ్ రావుతో పాటు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.మరోవైపు హరీశ్ రావు అరెస్ట్ ..మిగతా 2లో

# హరీశ్‌రావును అరెస్టు చేయొద్దు
### మినహా తదుపరి దర్యాప్తు చేయొచ్చు
### విచారణకు వాయిదా



**హైదరాబాద్, డిసెంబర్ 5 (ప్రభాత ఉదయం):** పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో హరీశ్ రావును అరెస్టు చేయవద్దని హైకోర్టు ఆదేశించింది. అరెస్టు మినహా తదుపరి దర్యాప్తు చేపట్టవచ్చని స్పష్టం చేసింది. దర్యాప్తునకు సహకరించాలని హరీశ్‌రావుకు సూచించింది. హరీశ్‌పై ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నేత చక్రధర్‌గౌడ్‌కు నోటీసులు జారీసింది. విచారణను వాయిదావేసింది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్న హరీశ్ రావును అక్రమ కేసుల్లో ఇరికించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో ..మిగతా 2లో

# సంధ్య థియేటర్‌లో తొక్కిసలాట.. మహిళ మృతి



**హైదరాబాద్, డిసెంబర్ 5 (ప్రభాత ఉదయం):** హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని సంధ్య థియేటర్‌లో పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా బుధవారం అర్ధరాత్రి తొక్కిసలాట చోటు చేసుకుంది. ప్రీమియర్ షో సందర్భంగా చోటు చేసుకున్న తొక్కిసలాటలో రేవతి (39) అనే మహిళ మృతి చెందగా.. ఆమె కుమారుడు శ్రీతేజ్ (9) తీవ్రంగా గాయపడ్డాడు. పరిమితికి మించి ప్రేక్షకులు థియేటర్‌కు రావడంతో పోలీసులు లాఠీ చార్జ్ చేయవల్సి వచ్చింది. తొక్కిసలాటలో తల్లీకొడుకు స్పృహ కోల్పోయారు. ఆర్టీసీ క్రాస్ రోడ్ వద్ద అర్ధరాత్రి పరిస్థితి అదుపు తప్పింది. చికిత్స పొందుతూ తల్లి మృతి చెందగా.. ..మిగతా 2లో

# హైదరాబాద్‌ను కాలుష్యరహితంగా మార్చేందుకు స్క్రాప్ పాలసీ

రానున్న రెండేళ్లలో
భాగ్యనగరంలో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులు
ఈవీ వాహనాలకు రిజిస్ట్రేషన్, ట్యాక్స్ ఫ్రీ చేశాం
రవాణాశాఖను కాపాడాల్సిన అవసరం ఉంది
నష్టాల్లో ఉన్న ఆర్టీసీ ఇప్పుడు లాభాల్లో నడుస్తోంది
మహాలక్ష్మి పథకంతో నష్టాల నుంచి గట్టెక్కిన ఆర్టీసీ
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి
రవాణాశాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన విజయోత్సవాలు


2

# ఇందిరమ్మ ఇండ్లను ప్రాధాన్యత క్రమంలో కేటాయిస్తాం

మొదటి పేజీ తరువాయి...

రేవంత్ వివరించారు. అచ్చం అలాగే కట్టాలని కాకుండా అవగాహన కోసం మాడల్ హౌజ్‌ను చూపిస్తామని చెప్పారు. మొదట ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇండ్ల కేటాయింపు ఉంటుందని రేవంత్ స్పష్టం చేశారు. మొత్తంగా 4.50 లక్షల ఇండ్లకు ఒక్కో ఇంటికి రూ. 5 లక్షల చొప్పున నిధులకు పరిపాలనా అనుమతులు ఇచ్చామని వెల్లడించారు. ఆదివాసీలు, ఆదివాసీ తండాలు (ఐటీడీఏ తండాలకు) జనాభా ప్రాతిపదికన ప్రత్యేకంగా పరిశీలించి అదనంగా కొన్ని వేల ఇండ్లను నిర్మిస్తామని సీఎం ప్రకటించారు. ఇప్పుడు కేటాయించిన ఇండ్లు కాకుండా ఆదివాసీలకు ప్రత్యేక కోటా ఇస్తామని చెప్పారు. గతంలో రుణాలు తీసుకుని ఇండ్లు కట్టుకున్న 7 వేల కుటుంబాల రుణాలను కూడా.. ప్రభుత్వం తీర్చి వారిని రుణ విముక్తులను చేస్తుందని ముఖ్యమంత్రి ప్రకటించారు. పెరిగిన ధరలు, పేదవాడి అవసరాలను దృష్టిలో పెట్టుకుని వారికి ఇండ్లు కట్టుకోవడానికి అండగా నిలవాలని.. ఈ పథకం తీసుకొచ్చినట్టు సీఎం వివరించారు. అందుకే ప్రతి



పేద వాడికి 5 లక్షలు ఇచ్చి ఇండ్లు కట్టుకోవడానికి ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. ఈ పథకంలో పేదలకు వెసులుబాటు కల్పిస్తూ విధివిధానాలను నిర్ణయించామని సీఎం రేవంత్ చెప్పారు. అదనంగా ఒక గది కట్టుకుంటామంటే అందుకు వెసులుబాటు కల్పించామని వివరించారు. ఇదొక పండగ సందర్భమని.. ఇండ్లు కట్టించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఆత్మగౌరవంతో బతకాలన్నది ప్రతి ఒక్కరి కల అని.. ఇందిరమ్మ రాజ్యంలో ఇంటిముందు వెలుగుల్లో పండగ చేసుకునే సందర్భమిదని అభిప్రాయపడ్డారు. కాగా తెలంగాణలో తొలిసారిగా అధికారంలో చేపట్టిన కాంగ్రెస్ పాలనకు ఏడాది పూర్తి కావొస్తోంది. గత ఏడాది డిసెంబర్ 3న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాగా.. 9వ తేదీన కాంగ్రెస్ సర్కార్ పీఠమెక్కింది. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. అయితే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రధానంగా ఆరు గ్యారెంటీలను ప్రస్తావించింది. కాంగ్రెస్ ప్రకటించిన 'సిక్సర్' వర్కౌట్ కావటంతో%ొ% తెలంగాణలో అధికారంలోకి వచ్చింది.అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్%ొ % ప్రధానంగా ఆరు గ్యారెంటీల అమలుపై దృష్టి పెట్టింది. సీఎం రేవంత్ రెడ్డి తొలి సంతకం కూడా ఆరు గ్యారెంటీల హామీలపైనే చేశారు. అంతేకాదు%ొ% సచివాలయంలో తొలి కేబినెట్ భేటీ జరిగింది. ఇందులో కూడా ఆరు గ్యారెంటీల హామీల అమలుపైనే చర్చించారు. పథకాల అమలు కోసం ప్రజా పాలన అనే కార్యక్రమాన్ని చేపట్టింది. అన్ని గ్రామాల్లో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించింది.



ఆలయంలో కొలువుదీరనున్న పోచమ్మ తల్లి




రాళ్ల గూడలో ఆలయం

## నేడు రాళ్లగూడ నూతన ఆలయంలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట

### భారీ ఏర్పాట్ల మధ్యన భక్తి శ్రద్ధలతో పూజలు

### స్థానిక కౌన్సిలర్ భాగ్యలక్ష్మి శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు

శంషాబాద్,డిసెంబర్ 5 (ప్రభాత ఉదయం) శంషాబాద్ పురపాలక సంఘం పరిధిలోని రాళ్లగూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ పోచమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. గ్రామస్తులందరి సహకారంతో నిర్మించిన నూతన ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు భక్తుల సమక్షంలోవేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్యన అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. స్థానిక కౌన్సిలర్ బండి భాగ్యలక్ష్మి శ్రీకాంత్ యాదవ్ పోచమ్మ విగ్రహ ప్రతిష్ట కమిటీ నేతృత్వంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు గతంలో ఎన్నడు లేని విధంగా అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు . రాళ్ల గూడా తో పాటు శంషాబాద్ పురపాలక సంఘం పరిధిలోని భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు. శుక్రవారం ఉదయం అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేసి అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.



కౌన్సిలర్ భాగ్యలక్ష్మి శ్రీకాంత్ యాదవ్ దంపతులు

# మాజీ మంత్రి హరీష్ రావు అరెస్ట్

మొదటి పేజీ తరువాయి...

సందర్భంగా కౌశిక్ రెడ్డి ఇంటిని పోలీసులు ధ్వంసం చేశారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఈ నేపథ్యంలో హరీశ్‌రావు అరెస్టును నిరసిస్తూ సిద్దిపేటలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు.. సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హరీశ్‌రావును వెంటనే విడుదల చేయాలని కార్యకర్తలు డిమాండ్ చేశారు.ఇక కౌశిక్ రెడ్డిని కలిసేందుకు వెళ్లిన హరీశ్‌రావును పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకున్నది. ఏడాది పాలన సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ హామీలపై ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్టు చేస్తున్న నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. ఇది ప్రజాస్వామ్య పాలన కాదు.. రాక్షస పాలన అని ధ్వజమెత్తారు. ఈ మేరకు హరీశ్‌రావు ఎక్స్ వేదికగా స్పందించారు. ఇందిరమ్మ రాజ్యమా..? ఎమర్జెన్సీ పాలనా..? అని నిలదీశారు హరీశ్‌రావు. ఫోన్ ట్యాపింగ్ చేశారంటూ ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్తే ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై ఉల్టా కేసు బనాయించారు. ఉదయాన్నే పదుల సంఖ్యలో పోలీసులు ఎమ్మెల్యే ఇంటి మీదకు వచ్చి అక్రమ అరెస్టు చేసే ప్రయత్నం చేశారు. ఈ దుర్మార్గాన్ని ప్రశ్నిస్తే, నాపై, బీఆర్ఎస్ నాయకులపై దుర్మార్గంగా ప్రవర్తించారు. అక్రమ అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలిస్తున్నారు. అడిగితే అరెస్టులు, ప్రశ్నిస్తే కేసులు, నిలదీస్తే బెదిరింపులు. ప్రజాస్వామ్య పాలన అని డబ్బా కొడుతూ, రాక్షస పాలన కొనసాగిస్తున్నావు. నీ పిట్ట బెదిరింపులకు, అక్రమ కేసులకు భయపడే వాళ్ళం కాదు. తెలంగాణ సమాజమే నీకు బుద్ధి చెబుతుంది అని రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. కాగా ఏడాది పాలన సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన తప్పులపై బీఆర్ఎస్ నేతలు ప్రశ్నలు సంధిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ప్రశ్నల పరంపర కొనసాగుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టులు చేసి పోలీసు స్టేషన్లనకు తరలిస్తున్నారు. ఇవాళ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, పాడి కౌశిక్ రెడ్డి, జగదీశ్ రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి, ఆయా పోలీసు స్టేషన్లకు తరలించారు. ఈ అరెస్టులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా రేవంత్ సర్కార్‌పై ధ్వజమెత్తారు.ప్రభుత్వ తప్పులపై ప్రశ్నిస్తే కేసులు..! పార్టీ హామీలపై నిలదీస్తే అరెస్టులు..! చేస్తున్నారంటూ కేటీఆర్ మండిపడ్డారు. పాలనలో లోపాలను గుర్తు చేస్తే కేసులు.. గురుకులాల్లో విద్యార్థుల అవస్థలను పరిశీలిస్తే కేసులు.. ప్రభుత్వం లాక్కుంటున్న భూములపై ఎదిరిస్తే కేసులు.. ప్రభుత్వం కూల్చుతున్న ఇండ్లకు అడ్డొస్తే కేసులు.. ప్రభుత్వంలోని వ్యవస్థలను వాడుకుని దుర్వినియోగం చేస్తున్నారని ఫిర్యాదు చేస్తే కేసులు.. చివరకు ప్రజలపై కూడా కేసులు నమోదు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం హింసిస్తుందని కేటీఆర్ నిప్పులు చెరిగారు. కేసులు.. కేసులు.. కేసులు.. ఈ పేర్లతో అటు ప్రజలను, ఇటు ప్రతిపక్షాన్ని బెదిరింపులకు గురి చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. కాసులు మీకు కేసులు మాకు.. సూటుకేసులు మీకు.. అరెస్టులు మాకు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రులు మా నాయకులు హరీష్ రావు, జగదీష్ రెడ్డి గార్లతోపాటు మా ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు, నాయకుల అరెస్టులు అప్రజాస్వామికం.. తక్షణం విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. చివరగా జాగో తెలంగాణ జాగో అని కేటీఆర్ నినదించారు.

# హరీశ్‌రావును అరెస్టు చేయొద్దు

మొదటి పేజీ తరువాయి...

భాగంగా ఫోన్ ట్యాపింగ్ చేశారంటూ సిద్దిపేట కాంగ్రెస్ ఇన్‌చార్జి చక్రధర్ గౌడ్ ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో హరీశ్‌రావుపై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలంటూ హైకోర్టులో హరీశ్‌రావు పిటిషన్ దాఖలు చేశారు. పంజాగుట్ట పీఎస్‌లో తనపై తప్పుడు కేసు నమోదు చేశారని అందులో పేర్కొన్నారు. రాజకీయ దురుద్దేశంతో ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశారని ఆయన తెలిపారు. నా ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్‌పై ముందుకు వెళ్లకుండా స్టే ఇవ్వాలని కోర్టును కోరారు. ఈనేపథ్యంలో హరీశ్ రావును అరెస్టు చేయవద్దని పోలీసులకు హైకోర్టు స్పష్టం చేసింది. చక్రధర్ తన ఫోన్ ట్యాపింగ్ అయ్యిందంటూ గతంలోనే హరీశ్‌రావుపై కేసు పెట్టారు. తన ఫోన్‌ను ట్యాపింగ్ చేశారంటూ నిరుడు ఆగస్టు 29న తనకు ఆపిల్ కంపెనీ నుంచి మెయిల్ వచ్చిందని ఈ ఏడాది జూన్ 19న డీజీపీకి ఫిర్యాదు చేశారు. తర్వాత పోలీసులు పట్టించుకోవడం లేదని హైకోర్టును ఆశ్రయించారు. హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, హరీశ్‌రావును ప్రతివాదులుగా చేర్చుతూ జూలై 16న రిట్ పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు విచారణకు స్వీకరించిన తర్వాత నవంబర్ 22న చక్రధర్ తన పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. మళ్లీ ఇదే అంశంపై పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చక్రధర్‌కు హరీశ్‌పై అనుమానం ఉంటే రిట్ పిటిషన్‌ను ఎందుకు ఉపసంహరించుకున్నారని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. హరీశ్‌రావు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి ద్వంద్వ నీతిని వీడియో ఆధారాలతో సహా బయటపెట్టిన నేపథ్యంలోనే కక్షతో మంగళవారం కొత్తగా కేసు నమోదు చేయించారని ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత హరీశ్‌పై నాలుగు కేసులు నమోదయ్యాయి. రైతులకు ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తానని రేవంత్‌రెడ్డి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిపై ఒట్టేసి మాట తప్పారని హరీశ్‌రావు ఆగ స్టు 22న యాదగిరిగుట్ట ఆలయంలో శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. దీంతో ఆయనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. రెం డో కేసు ఈ ఏడాది అక్టోబర్ 4న సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో నమోదైంది. మంత్రి కొండా సురేఖకు బీజేపీ ఎంపీ రఘు నందన్‌రావు నూలుపోగు దండ వేయడంపై ఓ వ్యక్తి సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడు. నిందితుడి సోషల్ మీడియాలో హరీశ్ ఫొటో కనిపించిందనే సాకుతో కేసు నమోదు చేశారని బీఆర్ఎస్ నేతలు చెప్తున్నారు. మూడో కేసు ఈ ఏడాది అక్టోబర్ 25న బేగంబజార్‌లో నమోదైంది. హామీలను ఎగవేస్తున్నందుకు సీఎం రేవంత్‌రెడ్డిని 'ఎగవేతల రేవంత్‌రెడ్డి' అని సంభోదించినందుకు హరీశ్‌పై కేసు నమోదు చేశారు. నాలుగో కేసు కరీంనగర్‌లో నవంబర్ 25న నమోదైంది. ఓ కార్యక్రమంలో రేవంత్‌రెడ్డిని విమర్శించారన్న కారణంతో కేసు నమోదు చేశారు.

## మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఫడ్నవీస్ ప్రమాణం

మొదటి పేజీ తరువాయి...

సపరివారంగా హాజరయ్యారు. అలాగే, ఈ కార్యక్రమానికి సుమారు 40 వేల మంది బీజేపీ మద్దతుదారులు, మతపెద్దలు హాజరయ్యారు.రెండుసార్లు ముఖ్యమంత్రి గా పనిచేసిన ఫడ్నవీస్ రెండోసారి 2014 నుంచి 2019 వరకు బీజేపీ-శివసేన ప్రభుత్వానికి నాయకత్వం వహించారు. 2019 ఎన్నికల తరువాత, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన సిఎం పదవి కోసం బిజెపితో సంబంధాలు తెంచుకున్నప్పుడు, ఫడ్నవీస్ తిరిగి అజిత్ పవార్ మద్ధతుతో సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే ఎన్సీపీ ఎమ్మెల్యేల నుంచి తగినంత మద్దతు పొందడంలో అజిత్ పవార్ విఫలం కావడంతో ఈ ప్రభుత్వం కేవలం 72 గంటలు మాత్రమే కొనసాగింది. అనంతరం, శివసేనలో చీలిక రావడంతో షిండే నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వంలో ఫడ్నవీస్ డిప్యూటీ సీఎం అయ్యారు.

## సంధ్య థియేటర్‌లో తొక్కిసలాట.. మహిళ మృతి

మొదటి పేజీ తరువాయి...

కొడుకు పరిస్థితి విషమంగా ఉంది. దీనికి సంబంధించి అనేక వీడియోలు ఆన్‌లైన్‌లో ప్రస్తుతం వైరల్‌గా మారాయి. వీడియోలో ప్రేక్షకులు థియేటర్ ప్రాంగణా న్ని ముంచెత్తడం కనిపిస్తుంది. ఈ ఘటనలో బాలుడు శ్రీతేజ్ స్పృహ తప్పిపడిపోవడం కనిపిస్తుంది. పోలీసు అధికారులు బాలుడిని తీసుకొచ్చి, చేసే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో బాలుడి ఛాతిపై చేతులతో సీపీఆర్ చేసి, బాలుడి చేతులు, కాళ్ళను రుద్దడం వంటివి చేశారు. అనంతరం బాలుడిని బేగంపేట్ కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

## హైదరాబాద్‌ను కాలుష్యరహితంగా మార్చేందుకు స్క్రాప్ పాలసీ

హైదరాబాద్, డిసెంబర్ 5 (ప్రభాత ఉదయం): మహాలక్ష్మి పథకం అమలుతో రాష్ట్ర రోడ్డు రవాణాసంస్థను నష్టాల నుంచి గట్టెక్కించామని ముఖ్యమంత్రి రేవంత్?రెడ్డి అన్నారు. ఇప్పటివరకు 115 కోట్ల మంది ఉచిత బస్సు ప్రయాణాన్ని ఉపయోగించుకున్నారని వివరించారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా రవాణాశాఖ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఆర్టీసీ, రవాణశాఖ స్టాళ్లను పరిశీలించారు. రవాణాశాఖ లోగోను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి, రవాణాశాఖ, ఆర్టీసీ విజయాలపై కరపత్రం విడుదల చేశారు. 54 మంది ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. ఏడాదిలోపే 55 వేల ఉద్యోగాలిచ్చామని ఒక్కటి తగ్గినట్లు నిరూపించినా క్షమాపణ చెప్పేందుకు సిద్ధమని మాజీ సీఎం కేసీఆర్, ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి రేవంత్?రెడ్డి సవాల్ విసిరారు. దేశంలో మెట్రో నగరాలన్నీ కాలుష్యకాసారంతో సతమతమవుతున్న వేళ హైదరాబాద్ ఆ ఊబిలో చిక్కుకోవద్దనే స్క్రాప్ పాలసీ తీసుకొచ్చామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. రానున్న రెండేళ్లలో భాగ్యనగరంలో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. రవాణాశాఖను కాపాడాల్సిన అవసరం ఉంది. వాళ్ల హక్కులను, ఆకాంక్షలను నిలబెట్టాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. ఆనాడు 6 గ్యారంటీలకు ఆర్టీసీ కార్మికులు తమ బాధ్యతను నెరవేర్చారు. అందుకే ఈనాడు ఈ ప్రభుత్వం విజయం సాధించింది. నష్టాల్లో ఉన్న ఆర్టీసీ ఇప్పుడు లాభాల్లో నడుస్తోంది. నగరం నిర్మానుష్యంగా మారకుండా ఉండేందుకే స్క్రాప్ పాలసీ తీసుకొచ్చాం. ఈవీ వాహనాలకు రిజిస్ట్రేషన్, ట్యాక్స్ ఫ్రీ చేశామని అన్నారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఆర్టీసీకి మంచిరోజులు వచ్చాయని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిబంధనలపై పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఆర్టీసీ, రవాణా సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్నామని రేవంత్‌రెడ్డి వెల్లడించారు. మూసీ ప్రక్షాళన జరగాలంటే ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 115.76 కోట్ల మంది ప్రయాణించారని తెలిపారు. దీంతో సుమారు రూ.3 వేల 902 కోట్లు ఆదా అయిందని వెల్లడించారు.

### కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన వైఫల్యాలపై బీజేపీ బహిరంగసభలో

# ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలి: బీజేపీ నాయకుడు బాల్ రెడ్డి

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 5 (ప్రభాత ఉదయం) తెలంగాణ లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసి ఏడాది గడుస్తున్నా ప్రజలకి చేసిన మేలు ఏమీ లేదని తెలంగాణ బీజేపీ నాయకుడు బాల్ రెడ్డి విమర్శించారు . గురువారం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా బాల్ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ ప్రజాభీష్టానికి అనుకూలంగా కాంగ్రెస్ నాన్చుడు ధోరణికి వ్యతిరేకంగా ఆరోజు పార్లమెంట్ లో తెలంగాణ ఏర్పాటుకు బీజేపీ మద్దతు ఇచ్చిందని,అంతే కాక తెలంగాణ ప్రజలు,ఉద్యమకారులు ఆత్మహత్యలకి పాల్పడవద్దని పార్లమెంట్ సాక్షిగా దివంగిత సుష్మాస్వరాజ్ పిలుపునివ్వడం కూడా తెలిసిందే అన్నారు . తెలంగాణ వచ్చినప్పటికీ గత 10 ఏండ్ల కెసిఆర్ పాలనలో కేవలం వారి కుటుంబం మాత్రమే అభివృద్ధి చెంది,యువకులు,ఉద్యోగులు ఆశలకి వ్యతిరేకంగా పాలన సాగిందన్నారు. అబద్ధపు హామీలతో,మోసపు మాటలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ మొదటి ఆరు నెలల్లోనే అత్యంత వ్యతిరేకత మూటగట్టుకుందన్నారు. భారతదేశంలో అతి తక్కువ సమయంలో అతి ఎక్కువ వ్యతిరేకత మూటగట్టుకున్న ఘనత తెలంగాణ లో ఉన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వానికే దక్కిందని ఎద్దేవా చేశారు. ప్రజలు అతి కొద్ది నెలల్లోనే కాంగ్రెస్ మోసపు హామీలు,దృతరాష్ట్ర కౌగిలి అని తెలుసుకుని,కెసిఆర్ రేవంత్ ఇద్దరు ఒకటే అని గ్రహించి,ప్రధానమంత్రి మోదీ గారి నేతృత్వం లో బీజేపీ కి అత్యధిక మద్దతు తెలుపుతున్నారు అని అన్నారు. రాష్ట్రం నుంచి ప్రతిపాదనలతో సంబంధం లేకుండా,బీజేపీ తెలంగాణ అధ్యక్షులు,కేంద్రమంత్రి కిషన్ రెడ్డి,కేంద్ర హోమ్ శాఖ సహాయమంత్రి బండి సంజయ్ ,బీజేపీ కేంద్ర ఉపాధ్యక్షురాలు,మహబూబ్ నగర్ ఎంపీ అరుణ,చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి తెలంగాణ ప్రజల కోసం అహర్నిశలు కష్టపడి,తెలంగాణ లో అభివృద్ధి పనులు వేగంగా జరిగే విధంగా కేంద్రం నించి నిధులు తీసుకువస్తున్నారు అని,రామప్ప సర్క్యూట్,సోమశిల,నేషనల్ హైవే అభివృద్ధి,రాడార్ సెంటర్ ఏర్పాటు,తదితర ఎన్నో కార్యక్రమాలు తెలంగాణ లో బిజెపి చేపట్టిన విషయం ప్రజలు గమనించాలి అని కోరారు. అసలు అభివృద్ధి అంటే ఏంటో కూడా తెలియని,తెలంగాణ ప్రజల సొమ్ముతో మహారాష్ట్ర,జారండ్‌కి ప్రత్యేక విమానాలు హెలికాప్టర్‌లలో వెళ్లి,ఘోర పరాభవం పొందిన కాంగ్రెస్ నాయకులు ఈరోజు వేడుకలు అనడం విడ్డూరంగా ఉంది అన్నారు. ప్రజలు నిరంతరం కాంగ్రెస్ పట్ల అసంతృప్తి,అభద్రతా భావనలో ఉన్నారు అని,తెలంగాణ లో బీజేపీ చేపట్టిన ఎన్నో ప్రభుత్వ వ్యతిరేక కార్యకరమాలకి ప్రజల మద్దతు దీనికి ఉదాహరణ అన్నారు. కాంగ్రెస్ కుటిల పరిపాలన పై ఇప్పటికే కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో ఛార్జ్ షీట్ విడుదల చేశాం అని,ఇది ప్రజల్లోకి ఇంకా తీసుకువెళ్లడానికి ఈ నెల 7 వ తేదీన సరూర్ నగర్ గ్రౌండ్స్ లో బీజేపీ భారీ బహిరంగసభ నిర్వహిస్తోంది అని తెలియజేశారు. ప్రజలందరూ అధిక సంఖ్య లో ఈ బహిరంగ సభ లో పాల్గొనాలి అని,కాంగ్రెస్ ఎటువంటి మేలు చేయలేదు అన్న విషయం ఈ సభ ద్వారా చాటిచెప్పాలి అని కోరారు. తెలంగాణ అంటేనే చైతన్యవంతం ఉన్న ప్రజల గడ్డ అని,బీజేపీ ఆద్వర్యంలో ప్రజలంతా మూకుమ్మడిగా కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనా హింస కోసం గళమెత్తాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి గద్వాల జిల్లా సభ్యత్వ నమోదు ఇంచార్జ్ బొక్క బాల్ రెడ్డి


# ప్రపంచ స్థాయి పోటీ తత్వాన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల విద్యార్థులకు నేర్పించడానికి కృషి

బుద్వేల్, డిసెంబరు (ప్రభాత ఉదయం): ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో థింకర్ కోడింగ్ ల్యాబ్ లను ఏర్పాటు చేసి విద్యార్థులను సైన్స్, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ రంగాలలో తీర్చిదిద్దడానికి శ్రీ రామ ఫైబర్ (ఎస్ఆర్ఎఫ్), నానక్ రామ్ గూడలోని క్యాప్ జెమినీ తో కలసి పనిచేస్తుందని ఎస్ఆర్ఎఫ్ ప్రాజెక్టు ఇంజనీర్ శేఖర్ తెలిపారు. బుద్వేల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 30 మంది విద్యార్థులను గురువారం నానక్ రామ్ గూడ లోని క్యాప్ జెమినీ కార్యాలయానికి తీసుకువెళ్లి వారి చేత వివిధ ప్రాజెక్టులను చేసి విదేశీ ప్రతినిధులకు చూపించారు. ఈ సందర్భంగా క్యాప్ జెమినీ కి చెందిన యూరప్, అమెరికా, జర్మనీ వంటి దేశాలకు చెందిన విదేశీ ప్రతినిదులు విద్యార్థులకు గ్లోబల్ అనుభవాలను వివరించారు. విద్యార్థులు చేసిన ప్రదర్శనలకు నచ్చి వారికి సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారని శేఖర్ తెలిపారు. రోబో రేస్, ప్రాజెక్టు ప్రదర్శనలు చేసి చూపించారు. కార్పోరేట్ సోషల్ రెస్పాన్స్ (సీఎస్ఆర్) లో బాగంగా ఎస్ఆర్ఎఫ్ క్యాప్ జెమినీ తో కలసి రాజేం ద్రనగర్ మండలంలోని రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బుద్వేల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శివరాం పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల అభివృది. విద్యార్థుల ప్రగతి కోసం కృషి చేస్తుందన్నారు. ప్రపంచస్థాయి విద్యా విధానాన్ని విద్యార్థులకు అందించడమే ఎస్ఆర్ఎఫ్. స్టెమ్ కోర్సుల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అందులో బాగంగా ఇప్పటి వరకు రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ. 10లక్షలతో విద్యార్థులకు కావాల్సిన మౌళిక వసతులు, బుద్వేల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ. 10 లక్షలు, శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.7 లక్ష లతో మౌళిక వసతులు కల్పించడం జరిగిందన్నారు. ప్రపంచంలో ఉన్న పోటీ రంగాన్ని విద్యారులకు ప్రాదమిక స్థాయి నుంచే నేర్పించి వారిని ప్రావీణ్యులను చేయడం కోసం ఎస్ఆర్ఎస్, క్యాప్ జెమినీ పని చేస్తుందన్నారు.


విద్యార్థులు చేసిన ప్రాజెక్టును చూస్తున్న విదేశీ ప్రతినిధులు



విద్యార్థులకు సర్టిఫికెట్‌లు అందచేస్తున్న క్యాప్ జెమినీ ప్రతినిధులు



ఇంటింటి సర్వే వివరాలను కంప్యూటర్లో నమోదు చేస్తున్న ప్రక్రియను పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ రవికుమార్

## సమగ్ర ఇంటింటి సర్వే కంప్యూటరీకరణ

**డిప్యూటీ కమిషనర్ రవికుమార్**

రాజేంద్రనగర్, డిసెంబర్ 5 (ప్రభాత ఉదయం) ఇంటింటి సర్వేలో ప్రజల నుంచి సేకరించిన వివరాలను కంప్యూటర్వీకరణ చేస్తున్నట్లు రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్ అన్నారు. గురువారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్లో సర్వే వివరాల కంప్యూటరీకరణ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ రవికుమార్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే సమగ్రంగా చేపట్టడం జరిగిందన్నారు. ప్రజల నుంచి సేకరించిన వివరాలను కంప్యూటర్లో పొందుపరిచి ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందన్నారు.



ప్రొ.జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనం


ప్రొ. ఆల్దాస్ జానయ్య

## తెలంగాణకు రెండు అఖిల భారత సమన్వయ పత్తి పరిశోధన కేంద్రాలు మంజూరు

**ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్విద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య**

బుద్వేల్, డిసెంబరు 5(ప్రభాత ఉదయం): తెలంగాణలో పత్తి పంటకు సంబంధించి రెండు అఖిల భారత సమన్వయ పత్తి పరిశోధన కేంద్రాలకి (ఏఐసిఆర్ పి) భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) ఆమోదం తెలిపింది. ఈ కేంద్రాలను మంజూరు చేస్తున్నట్లు ఐసీఏఆర్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య కు బుదవారం అధికారికంగా లేఖ రాసింది. రాష్ట్ర విభజన అనంతరం భారత వ్యవసాయ పరిశోధన మండలి పరిధిలో పత్తి పరిశోధన చేసే సమన్వయ కేంద్రాలు తెలంగాణ రాష్ట్రం పూర్తిగా కోల్పోయింది. ఫలితంగా గత పది ఏళ్లలో జాతీయస్థాయిలో పత్తి పరిశోధన వ్యవస్థలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్విద్యాలయం భాగస్వామి కాలేకపోయింది. ఇటీవల నూతనంగా నియమితులైన ఉపకులపతి ప్రొఫెసర్ అల్ధాస్ జానయ్య గత నెలలో ఢిల్లీలోని భారత వ్యవసాయ పరిశోధనా మండలి డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా.టి. పి శర్మ లను కలిసి తెలంగాణలో పత్తి పంట ప్రాధాన్యతను వివరించి వెంటనే అఖిలభారత పత్తి సమన్వయ పరిశోధన పరిశోధన పథకంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం కు భాగస్వామ్యం కల్పించి తదనుగుణంగా వరంగల్ లో ఒక ప్రధాన కేంద్రం, ఆదిలాబాద్ లో ఒక ఉప కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. దానితోపాటు ఆయా కేంద్రాలకు ఐ సీ ఏ ఆర్ సిబ్బందిని, నిధులను కేటాయించి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం లో పత్తి పంటలపై పరిశోధనలను పునః ప్రారంభించి రైతులకు రాగల రోజులలో సాంకేతిక మద్దతు ఇవ్వాల్సిందిగా కోరారు. ఈ విజ్ఞప్తికి భారత వ్యవసాయ పరిశోధనా మండలి డైరెక్టర్ జనరల్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సానుకూలంగా స్పందించి కేంద్రాలని వెంటనే మంజూరు చేస్తున్నట్లు బుదవారం అధికారికంగా సమాచారం అందిస్తూ లేఖను ఉపకులపతి కి పంపించారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఈ రెండు ఏ ఐ సీ ఆర్ పీ కేంద్రాలలో పూర్తిస్థాయిలో పరిశోధనలు చేపట్టనున్నట్లు ఉపకులపతి ప్రొఫెసర్ అల్ధాస్ జానయ్య తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్. జాన్ వెస్లీ

## పార్టీ విస్తరించి ఎందుకు శ్రేణులు పనిచేయాలి

**సిపిఎం పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్. జాన్ వెస్లీ**

రాజేంద్రనగర్, డిసెంబర్ 5(ప్రభాత ఉదయం) వాటిని విస్తృత పరిచేందుకు పార్టీ శ్రేణులు పనిచేయాలని సిపిఎం పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ జాన్ వెస్లీ అన్నారు. గురువారం సిపిఎం పార్టీ రాజేంద్రనగర్ మండల కమిటీ సమావేశం కామ్రేడ్ ఎస్ మోహన్ అధ్యక్షతన కాటేదాన్ ఆఫీస్ లో జరిగింది .ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఎం పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్. జాన్ వెస్లీ . హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాజేంద్రనగర్ ప్రాంతంలో. అన్ని రంగాల్లో సిపిఎం పార్టీ విస్తరించి పని చేయాలన్నారు పేద ప్రజలకు కార్మికులకు. మధ్యతరగతి. మరియు ప్రజలందరికీ సిపిఎం పార్టీ అవసరం ఎంతగానో ఉన్నది అన్నారు. సిపిఎం పార్టీ క్యాడర్ కార్యకర్తలు మధ్యలో ఉండి పనిచేయాలని తెలంగాణ ప్రభుత్వం హామీ ఇచ్చిన 6 గ్యారంటీలతోపాటు. ఇంకా ఇతర సమస్యలపై పని చేయాలని పిలుపునిచ్చారు తెలంగాణలో సిపిఎం పార్టీ. ప్రజలకు దిక్సూచిగా నిలుస్తుందన్నారు. పేదలందరికీ డబల్ బెడ్ రూమ్ తెల్లా రేషన్ కార్డు 500 అక్కా సిలిండర్ మహిళలకు 2500 తో పాటు నిరుద్యోగ యువతకు నిరుద్యోగ వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులందరికీ కనీస వేతనాలు అందే విధంగా. నిక్కచ్చి నిలబడి పని చేయాలని సమావేశంలో సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కాడిగళ్ల భాస్కర్ ,జిల్లా కార్యవర్గ సభ్యులు ఏం చంద్రమోహన్ హాజరై మాట్లాడారు. సమావేశంలో మండల కార్యదర్శి జిఎం కురుమయ్య ,మండల కమిటీ సభ్యులు .ఎన్ జంగయ్య జిఎం గట్టయ్య . ఎస్ మోహన్. తదితరులు పాల్గొన్నారు.



పార్టీ సభ్యత్వ కార్యక్రమం నిర్వహిస్తున్న సిపిఐ నాయకులు

## పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలు

**సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి**

బాలాపూర్, డిసెంబర్ 5(ప్రభాత ఉదయం) భారత కమ్యూనిస్టు పార్టీ బాలాపూర్ మండల సమితి కార్యకర్తలు నంది హిల్స్ లో సిపిఐ పార్టీ సభ్యత్వం సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ఆందోజు రవీంద్ర చారి చేతుల మీదగా తీసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ఆందోజు రవీంద్ర చారి మాట్లాడుతూ... భూమి కోసం భుక్తి కోసం పేద ప్రజల విముక్తి కోసం ఎర్రజెండా సరైన బాట అని నమ్మి ప్రజలు భారత కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షితులై ప్రజా సంఘాల నాయకులుగా పార్టీ కార్యకర్తలుగా పనిచేస్తూ నేడు సోషలిస్టు నిర్మాణమే కర్తవ్యం గా సమ సమాజ స్థాపన కోసం ఎర్రజెండా చేత భూమి నిస్వార్థంగా జనం కోసం పనిచేస్తున్న కార్యకర్తలు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు అని వారు పార్టీకి పట్టుకొమ్మలని పేర్కొన్నారు. సిపిఐ పార్టీ ఏర్పడి 100 సంవత్సరాలు అయ్యిందని కమ్యూనిస్టులు ప్రజల కోసం చిత్తశుద్ధితో నిస్వార్థంగా జీవితాలను త్యాగం చేసి పనిచేస్తున్నారని నిజమైన కార్యకర్తలు కమ్యూనిస్టు పార్టీకే సొంతమని అన్నారు... ఒక నూతన సమాజ నిర్మాణం కోసం పోరాడుతున్న పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్క కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని పార్టీ సభ్యత్వాన్ని పెంచుకోవడంతో పాటు అన్ని ప్రాంతాలకు విస్తరించాలని , మండల నాయకత్వం శాఖలను అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాలాపూర్ సిపిఐ పార్టీ మండల కార్యదర్శి ముకుందం గారి చంద్రశేఖర్ రెడ్డి, జర్పుల శివనాయక్, జాజాల అంజయ్య, బండ యాదమ్మ యాదవ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


భవిత పాఠశాలలో చదివి ఓపెన్ స్కూల్ ద్వారా 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థిని సన్మానిస్తున్న ఎం ఈ ఓ శంకర్ రాథోడ్, ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ సుగుణా రెడ్డి

## రాజేంద్రనగర్ భవిత పాటశాలలో దివ్యాంగుల దినోత్సవం

బుద్వేల్, డిసెంబరు5 (ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ భవిత పాఠశాలలో గురువారం ప్రపం చ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్, రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ ఎం.సుగుణారెడ్డిలు పాల్గొన్నారు. దివ్యాంగులైన విద్యార్థులకు బహుమతులు అంద చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ శంకర్ రాథోడ్ మాట్లాడుతూ, దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ము ందుకు సాగాలన్నారు. సకలాంగుల వలే అన్ని రంగాలలో పోటీ పడి ఉజ్వల భవిష్యత్తును సాదిం చుకోవాలన్నారు. తల్లిదండ్రుల సూచనలను పాటించాలన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ ఎం. సుగుణారెడ్డి మాట్లాడుతూ, దివ్యాంగుల పట్ల ఎవరు కూడా వివక్ష చూపరాదన్నారు. వారికి చేయూత నందించి ఆసరాగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాద్యాయులు శ్రీనివాస్, యాదగిరి, సీతయ్య. హనుమంతురావు, బాబురావు, స్పెషల్ టీచర్స్ లక్ష్మి, స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇంట్లో ఎవరికి చెప్పకుండ వెళ్లిపోయిన వివాహిత


మన్మీత్ కౌర్


జాఫర్ ఖాన్

బుద్వేల్, డిసెంబరు5 (ప్రభాత ఉదయం): ఓ వివాహిత యువతి ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన ఇది. ఈ సంఘటన రాజేంద్రనగర్ సర్కిల్ సిక్ చావునీలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలు ఈ విధంగా ఉన్నాయి... సిక్ చావునీ కి చెందిన కోమల్ కౌర్ కుమార్తె ఎస్. మన్మీత్ కౌర్(24)కు 2021లో బల్జీత్‌సింగ్‌తో వివాహం జరిగింది. బల్జీత్ సింగ్, మన్ మీత్ కౌర్ మధ్య ఏర్పడిన మనస్పర్థల కారణంగా మన్మీత్ కౌర్ తల్లిగారింటి వద్దనే ఉంటుంది. గురువారం అందరు నిద్రిస్తుండగా మన్ మీత్ కౌర్ ఎవరికి చెప్పకుండ ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. దీంతో ఆమె తల్లి కోమల్ కౌర్ అత్తాపూర్ పోలీసు లకు ఫిర్యాదు చేసింది. మా కూతురు మన్మీత్ కౌర్ గురువారం ఇంట్లోనుంచి వెళ్లిపోయిందని, ఆమె కోసం స్నేహితులు, బంధువుల వద్ద వెదికినా ఫలితం లేకుండాపోయి ందన్నారు. నా కూతురు కాలేజ్ చేసే సమయంలో మలక్‌పేట్ సలీమనగర్‌కు చెందిన మంజీత్‌శర్మతో పరిచయం ఉండేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. అతనిపై అనుమానం ఉందని ఫిర్యాదు లో పేర్కొన్నారు.

**మరో సంఘటనలో...**

ఆటో నడుపుకునే నా భర్త ఇంట్లోనుంచి వెళ్లి తిరిగి రాలేదని ఓ మహిళ అత్తాపూర్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసింది. వివరాలు ఈ విదంగా ఉన్నాయి.... హాసన్ నగర్ ఇంద్రానగర్ బస్ స్టాప్ సమీపంలో నివాసం ఉండే జాఫర్ ఖాన్(38) ఆటో నడుపుతాడు. ఈ నెల 4వ తేదీన ఉదయం ఆరు గంటల కు ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆయన కోసం ఎంత వెదికినా ఫలితం కనిపించలేదు. దీంతో ఆయన భార్య ఫాతిమా బేగం అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన భర్తకు మద్యం సేవించే అలవాటు ఉందన్నారు. కేసు నమోదు చేసుకున్న అత్తాపూర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## దుర్గానగర్‌లో సిగ్నల్ సమయాన్ని క్రమబద్ధీకరించండి



రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ రాజేందర్ గౌడ్‌ను కలసి వినతి పత్రం అందచేసిన నవారు మురళీధర్ రెడ్డి తదితరులు

బుద్వేల్, డిసెంబరు5 (ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ దుర్గానగర్ చౌరస్తాలో ఆరాం ఘర్ వైపు యూ టర్న్ తీసుకుంటున్నప్పుడు సిగ్నల్ సమయాన్ని పెంచాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యాలయ కన్వీనర్ నవారు మురళీధర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం ఆరాంఘర్ చౌరస్తాలో గల రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో ఇన్స్ పెక్టర్ రాజేందర్ గౌడ్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ట్రాఫిక్ లైట్లలో సెకన్ల గణన లేకపోవ డం కారణంగా వాహనదారులు ఇష్టానుసారంగా ప్రయాణిస్తున్నారన్నారు. దీంతో ప్రమాదాల బారిన పడుతున్నారని వా పోయారు. బాబుల్ రెడ్డినగర్ నుంచి వచ్చే వారు ఆరాంఘర్ వైపు మరలడానికి సిగ్నల్ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. వీటన్నింటిని సరిచేసి వాహనదారులు ఇబ్బందులు పడకుండ చూడాలన్నారు. ఇన్స్ పెక్టర్ ను కలసిన వారిలో నాయకులు చంద్రశేఖర్, మహేందర్ రెడ్డిలు పాల్గొన్నారు.

## మాజీ మంత్రులు, ఎమ్మెల్యేల అరెస్టుకు నిరసన



పీడీపీ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బుద్వేల్, డిసెంబరు 5(ప్రభాత ఉదయం): బీఆర్ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేల అక్రమ అరెస్టులకు నిరసనగా రాజేంద్రనగర్ సర్కిల్ పీడీపీ చౌరస్తా వద్ద గురువారం రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశ పాలన కొనసాగిస్తున్నదన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండ ప్రతిపక్ష పార్టీల కు చెందిన మాజీ మంత్రులను, ఎమ్మెల్యేలను అరెస్టులు చేయడం కోసమే పనిచేస్తున్నదన్నారు. ఇది అత్యంత హేయమైన చర్య అని మండిపడ్డారు. నిరసన కార్యక్రమంలో నాయకులు వి.ప్రీతంరాజు, కట్టెలమండి గౌతమ్, కవ్వగూడెం గిరిబాబు, శ్రీనివాస్ రెడ్డి, సారంగపాణి, కమల్, మహ్మద్ ఖాధర్, శ్రీదర్రెడ్డి, ఫజల్, రామేశ్వర్ రెడ్డి, శివ, అశ్వక్ తదితరులు పాల్గొన్నారు.

## సాధారణ కార్యకర్త నుండి యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా ఎదిగిన విద్యార్థి నాయకుడు రూపావత్ హరి ప్రసాద్


రూపావత్ హరి ప్రసాద్

బుద్వేల్, డిసెంబరు 5( ప్రభాత ఉదయం): తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రూపావత్ హరి ప్రసాద్ ఎన్నికైనారు. హరిప్రసాద్ నల్గొండ జిల్లా దామరాచర్ల మండలం పుట్టాలగడ్డ మారుమూల గ్రామం లోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నాడు. చిన్నతనం నుండే విద్యార్థి సమస్యలపై పోరాడిన పోరాడే వారు. 2015 లో జరిగిన రంగారెడ్డి జిల్లా %చీూఖ×% ఎన్నికల్లో జిల్లా కార్యదర్శి గా ఎన్నికయ్యారు. 2018 లో జగిత్యాల రంగారెడ్డి, వనపర్తి,హైదరాబాద్ జిల్లా ల ఇంచార్జి బాధ్యతల స్వీకరించారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడి హోదాలో అనేక విద్యార్థి, రైతు ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించాడు. దేశంలోని వివిధ యూనివర్సిటీ లకు జరిగిన ఎన్ ఎస్ యు ఐ ఎన్నికల ప్రచారంలో తనదైన శైలిలో ప్రచారం చేసారు. ఢిల్లీ యూనివర్సిటీ లో జరిగిన విద్యార్థి సంఘ ఎన్నికల్లో ఎన్ ఎస్ యు ఐ విజయం సాధించడంలో హరి ప్రసాద్ విశేష కృషి చేసారు. హైదరాబాద్ రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ విద్యార్థి సమస్యలపై నిరంతర పోరాటం చేశాడు . తెలంగాణ లో ఐ సీ ఏ ఆర్ అనుమతి లేని నకిలీ అగ్రికల్చర్ కాలేజీలను ప్రభుత్వ అదినంలో తీసుకోవాలని, అనుమతి లేని కాలేజీ లను మూసివేయ్యాలని వ్యవసాయ శాఖా ప్రధాన కార్యాలయం ముట్టడి చేసారు. వ్యవసాయ శాఖ నకిలీ ఉద్యోగుల నియామకం రద్దు చేసి అర్హులైన అగ్రి గ్రాడ్యుయేట్లకు న్యాయం కోసం పోరాటం చేశాడు. ఎన్ ఎస్ యు ఐ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ హోదాలో అన్ని జిల్లాలు తిరుగుతూ విద్యార్థి సంఘమైన ఎన్ ఎస్ యు ఐ లో వేల మందిని చేర్పించడం ద్వారా ఎన్ ఎస్ యు ఐ ను బలోపేతం చేసాడు .

**యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపా ధ్యక్షుడిగా పోటీ చేయడం**

ఈ 9 ఏళ్లలో ఎన్ ఎస్ యు ఐ లో రంగారెడ్డి జిల్లా కార్యదర్శి గా, జగిత్యాల, వనపర్తి, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఇంచార్జి గా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సేవలందించారు . భావి ప్రధాని రాహుల్ గాంధీ అభిమానిగా,తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ఆశీస్సులతో ఎన్ ఎస్ యు ఐ/ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రస్తుత ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సహకారంతో, ఇందిరా ఫెలోషిప్ తెలంగాణ ఇంచార్జి , అసిస్టెంట్ ప్రొఫెసర్ సల్ల సౌజన్య మద్ధతుతో యూత్ కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైనారు . ఈ సందర్బంగా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రూపావత్ హరి ప్రసాద్ మాట్లాడుతూ..నా పై నమ్మకం తో అధిష్టానం అప్పగించిన బాధ్యత ను, విద్యార్థుల డిమాండ్ లను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిస్కారానికి కృషి చేస్తానని చెప్పారు, డాక్టర్ బి ఆర్ అంబేద్కర్, సేవాలాల్ మహారాజ్, కొమురం భీమ్, పూలె ఆశయాలకు అనుగుణంగా పని చేస్తానని చెప్పారు. హరి ప్రసాద్ ను వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎన్ఎస్యు ఐ విద్యార్థులు అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం బదులుగా ఒక్క మాసం ఇస్తే నా మీసం తీస్తా



బహిరంగ సభలో మాట్లాడుతున్న నాగు రావు నామోజీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బిజెపి నాయకులు

## బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ అధ్యక్షులు నాగరావు నామోజీ

కొత్తకోట, డిసెంబర్ 5(ప్రభాత ఉదయం) కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, లబ్ధిదారులకు లక్ష రూపాయలు,తులం బంగారం ఇస్తానన్న సీఎం రేవంత్ రెడ్డి తులం బదులుగా ఒక్క మాసం బంగారం ఇస్తే నా మీసం తీసుకుంటానని రాష్ట్ర బిజెపి క్రమశిక్షణ కమిటీ అధ్యక్షులు నాగురావు నామోజీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. గురువారం కొత్తకోట మున్సిపల్ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా సంబరాలు చేస్తున్న నేపథ్యంలో రాష్ట్ర బిజెపి పార్టీ పిలుపుమేరకు బైక్ ర్యాలీ నిర్వహించి నిరసన కార్యక్రమాలను బిజెపి పార్టీ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించి పట్టణ చౌరస్తాలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగురావు నామోజీ పాల్గొని మాట్లాడుతూ... మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని త్వరలో రేవంత్ రెడ్డి ని ప్రజాకోర్టులోనిలబెడతామని చెప్పారు. తెలంగాణ ప్రజలకు ఏమి చేశారని ఈ సంబరాలు చేసుకుంటున్నారని ఆరు గ్యారెంటీ పథకాలలో ఒక్క గ్యారెంటీ పథకం కూడా అమలు చేయలేదని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో 58, లక్షల రైతులు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే పది ఐదు వేల రూపాయల రైతు భరోసా వస్తుందని నమ్మి మోసపోయారని ఏ ఒక్క రైతుకు కూడా భరోసా ఇవ్వలేదని, అలాగే కౌలు రైతులకు 12 వేల, రూపాయలు ఇస్తామని ఇవ్వలేదని, మహిళలకు 3000,నుండి 6000, రూపాయలు ఇస్తామని ఆశ చూపి పింఛన్లు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. ప్రజల ఓట్లతో గద్దెనెక్కి ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న సర్పంచ్,ఎంపీటీసీ, జెడ్పిటిసి, ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను గెలిపించి కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర నియోజకవర్గ ఇంచార్జ్ కొండ ప్రశాంత్, మాజీ జిల్లా అధ్యక్షులు ఎద్దుల రాజవర్ధన్ రెడ్డి, కౌన్సిలర్ కొమ్ము భరత్ భూషణ్, మండల అధ్యక్షులు కోటీశ్వర్ రెడ్డి, నారాయణరెడ్డి, మాధవరెడ్డి, వెంకట్ రెడ్డి, పబ్బ నరేందర్ గౌడ్, సాయిరాం,స్టార్ బాలు,ఏలియా, తదితరులు పాల్గొన్నారు.



నూతన వధూ వరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

## కొడిగంటి చంద్రారెడ్డి కూతురి వివాహ వేడుకలు

### వధూవరులను ఆశీర్వదించిన అతిరథ మహారథులు

శంషాబాద్, డిసెంబర్ 5( ప్రభాత ఉదయం) శంషాబాద్ మండల సీనియర్ నాయకుడు కోడిగంటి చంద్రారెడ్డి కూతురు వివాహం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. చంద్రారెడ్డి కూతురు పూజా రెడ్డి వివాహం. విజయానందన్ రెడ్డితో గురువారం శంషాబాద్ లోని మల్లిక జెడి కన్వెన్షన్ హాల్ లో కన్నుల పండుగగా జరిగింది వివాహ కార్యక్రమానికి మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డి సోదరులు ఏ తిరుపతిరెడ్డి, ఏ కృష్ణారెడ్డి,మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి,మండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్. మండల ప్రముఖులు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుక్క వేణుగోపాల్, గణేష్ గుప్తా. దూడల వెంకటేష్ గౌడ్. నీరటి రాజు ముదిరాజ్. సుష్మా మహేందర్ రెడ్డి. బండి గోపాల్ యాదవ్. దండు ఇస్తారి. కాసుల చంద్రశేఖర్ గౌడ్. పారేపల్లి శ్రీనివాస్ గౌడ్. శ్రవణ్ కుమార్ గౌడ్. దవణాకర్ గౌడ్. కొత్త నరసింహారెడ్డి. కూచిరెడ్డి శంకర్ రెడ్డి. చక్రధర్ రెడ్డి. సూర్య ప్రకాష్ గుప్తా. చెన్నం అశోక్. జహంగీర్ ఖాన్. మునగాల జైహింద్ రెడ్డి, జిట్టే సిద్దులు. పులిపాటి పాండు. దీపా మల్లేష్. కరుణాకర్ గౌడ్. తోకల మురళి యాదవ్. మేకల వెంకటేష్ ముదిరాజ్. కోనమోల శ్రీనివాస్.పూసలపాటి యాదయ్య గౌడ్. రామనాథ్ ముదిరాజ్ . కోట్ల చంద్రకాంత్. బండి శ్రీకాంత్ యాదవ్. బుచ్చిరెడ్డి. అనగోనే శ్రీకాంత్ గౌడ్. తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సిపిఎం నాయకులు నరసింహ

## ఆందోళన కార్యక్రమాలను జయప్రదం చేయండి

### సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఉప్పేర్ నరసింహా

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 5(ప్రభాత ఉదయం)ప్రభుత్వ ఆసుపత్రులలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో జరిగే ఆందోళన కార్యక్రమాలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఉప్పేర్ నరసింహా ప్రజలకు పిలుపు ఇచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధరూర్, గద్వాల మండలాలలోని ప్రభుత్వ ఆసుపత్రుల సమస్యలపై మూడు రోజుల పాటు అధ్యయనం చేశామని అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రులకు సొంత భవనాలు లేకపోవడం,రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్య సిబ్బంది లేకపోవడం, తీవ్రమైన మందుల కొరత, కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం వంటి ప్రధాన సమస్యలు తమ దృష్టికి వచ్చాయన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని శుక్ర, శనివారాలలో ధరూర్ గద్వాల మండల కేంద్రాలలోని తహసీల్దార్ కార్యాలయాల ముందు ఆందోళన నిర్వహించి వినతిపత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం చలో కలెక్టరేట్ కార్యాలయం కార్యక్రమం ఉంటుందని అన్నారు. ఈ ఆందోళన కార్యక్రమాలలో ప్రజలు పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు వెంకటేశ్వర్లు, పరశురాం, ఎస్ఎఫ్ఐ నాయకులు శివ కుమార్ పాల్గొన్నారు.



పిడిఎఫ్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న వాహనం

## అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

కేటిదొడ్డి, డిసెంబర్ 5(ప్రభాత ఉదయం) పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఓ బొలేరో వాహనాన్ని గురువారం కేటిదొడ్డి పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ బి.శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం ... కేటిదొడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో అనుమానం వచ్చి ఓ బొలేరో వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 35 క్వింటాళ్ల రేషన్ బియ్యం గుర్తించడం జరిగింది. తక్కువ ధరకు కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా రాయచూరుకు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. రేషన్ బియ్యాని స్వాదీనం చేసుకుని, ధరూర్ మండలం పార్చర్ల గ్రామానికి చెందిన సహదేవుడి పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

## ప్రజాహితమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే జీఎంఆర్

మూసాపేట్, డిసెంబర్ 5(ప్రభాత ఉదయం) ప్రజాహితమే ప్రభుత్వ లక్ష్యమని దేవరకద్ర నియోజకవర్గం శాసనసభ్యులు జీఎంఆర్ అన్నారు. గురువారం దేవరకద్ర నియోజకవర్గం మూసాపేట్ మండల కేంద్రంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు స్థానిక నాయకులు, అధికారులతో కలిసి చెక్కులు ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి చెక్కులు పంపిణీ చేశారు.అనంతరం మండల కేంద్రంలోని పశు వైద్యశాలను సందర్శించి, నూతన భవన నిర్మాణం కు సంబంధించిన ప్రపోజల్స్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు . అనంతరం ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో హైమాస్ట్ లైట్లను ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఏఓ సాజిద్ రెహ్మాన్

## రైతులు ఆధునిక పద్ధతులు అవలంభించాలి

### మండల వ్యవసాయ అధికారి సాజిద్ రెహ్మాన్

గద్వాల ప్రతినిధి, డిసెంబర్ 5(ప్రభాత ఉదయం) ఆధునిక వ్యవ సాయ పద్ధతులను అవలంభిస్తూ పంటల ను సాగు చేయాలని కేటిదొడ్డి మండల వ్యవసాయ అధికారి సాజిద్ రెహ్మాన్ రైతులకు సూచించారు. గురువారం కేటిదొడ్డి, మైలగడ్డ, కుచినెర్ల , గువ్వలదిన్నె, పాతపాలెం వ్యవసాయ క్లస్టర్ పరిధిలో ని రైతువేధికలలో ప్రపంచ మృతిక దినోత్సవాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎంఏఓ మాట్లాడు తూ... ప్రస్తుతం రైతులు అవలంభిస్తున్న పద్ధతులతో భూసారం క్షీణించిపోతోందని, ఎరువుల వాడకం, పచ్చిరొట్ట ఎరువుల సాగు, పంటమార్పిడి, అంతర పంటలు, అవసరాన్ని బట్టి పురుగు, తెగుళ్ల మందుల వాడకాన్ని వివరిం చారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని 20-25 శాతం వరకు తగ్గించుకోవాలని రైతులకు సూచిం చారు. ఏ పంటలు సాగు చేయాలన్నా భూసార పరీక్షలు చేసి సాగు విధానాన్ని అవలంభించాలని రైతులకు సూచించారు. రసాయన ఎరువులు మరియు మందులు వాడకంతో నేల, జీవరాశులు నష్టపోతున్నాయని, 22 రకాల నేలలతో తెలంగాణ సంపన్నం, నల్ల, ఎర్ర ఇసుక నేలలలోని నీటి నిల్వ సామర్థ్యాన్ని, పోషకాల అందుబాటును మెరుగుపర్చాలని కోరారు. పచ్చిరొట్ట పంటల వాడకం ద్వారా నేల సారవంతం పెంచుకోవచ్చన్నారు. వాలుకు అడ్డంగా దున్నడం వల్ల భూమి కోతను నివారించవచ్చన్నారు. లవణ సమస్యను నివారించేందుకు నీటి వనరులను సమర్థ వంతంగా ఉపయోగించుకోవాలన్నారు. ఒక ఇంచు నేల తయారికి. శతాబ్దాల సమయం పడుతుందని, భవిష్యత్తు తరాలకు సారవంతమైన భూమిని అందించడానికి మనమంతా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు ప్రీతి సుధా, ప్రియాంక, జ్యోతి, లావణ్య, నరసింహ్మా, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు





బంద్ పిలుపు పోస్టర్‌ను విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

## ఒక రోజు రాష్ట్ర వ్యాప్తబంద్‌ను జయప్రదం చేయండి

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 5(ప్రభాత ఉదయం) డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 7న తలపెట్టిన ఒకరోజు రాష్ట్ర వ్యాప్త బంద్ ను జయప్రదం చేయాలని తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రైవేట్ రోడ్ ట్రాన్స్ ఫోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (సి ఐ టి యు అనుబంధం )జిల్లా అధ్యక్షుడు ఎం వెంకటేశ్వర్లు డ్రైవర్లకు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలో పాత బస్టాండ్ లోని వైయస్సార్ చౌరస్తాలో ఆటో డ్రైవర్లతో కలిసి కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళల ఉచిత ప్రయాణం వల్ల తమ జీవనోపాధి దెబ్బతిన్నదని అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలో భాగంగా మహిళల ఉచిత ప్రయాణం వల్ల జీవనోపాధి కోల్పోయిన డ్రైవర్లకు సంవత్సరానికి పన్నెండు వేల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చిందని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు పరచకపోవడం వల్ల కార్మికులకు ఉపాధి లేక తమ కుటుంబాలను పస్తులు ఉంచవలసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. డ్రైవర్లపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా సీఐటీయూ, ఏఐటియుసి, బిఆర్ టియు, తదితర సంఘాల ఆధ్వర్యంలో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని డిసెంబర్ 7న ఆటోల బంద్ కు పిలుపునిచ్చాయని అన్నారు. ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, యాక్సిడెంట్ భీమాను 10 లక్షలకు పెంచి సాధారణ మరణాలకు వర్తింపజేయాలని, ఆటోలకు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ ప్రభుత్వమే చెల్లించాలని, 50 సంవత్సరాలు నిండిన ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం వృద్ధాప్య పింఛన్లు ఇవ్వాలని, ఆటో డ్రైవర్ ల ఆటోలకు ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలు కేటాయించాలని తదితర డిమాండ్లతో పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు వెంకటేష్, శ్రీనివాస్, మెహబూబ్, రాజు, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## చేనేత వస్త్రాలు ధరించాలి: జిల్లా కలెక్టర్ సంతోష్

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 5(ప్రభాత ఉదయం)చేనేత రంగాన్ని ప్రోత్సహించేందుకు, చేనేత వస్త్రాలు ధరించి, మాటల కన్నా చేతల ద్వారా మార్పును చూపించాలని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ అన్నారు. గురువారం ఐ.డి.ఓ.సి సమావేశం హాల్ నందు ప్రజా పాలన-ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో చేనేత సంబరాల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం ఏడాది పాలన సందర్భంగా డిసెంబరు 1వ తేదీ నుండి 9వ తేదీ వరకు ప్రజాపాలన - ప్రజా విజయోత్సవాలలో భాగంగా ప్రతిరోజు వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. దేశంలో వ్యవసాయ రంగం తర్వాత చేనేత రంగం రెండవ స్థానం ఆక్రమించిందని, గద్వాల చేనేత చీరలు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ఖ్యాతి పొందాయని, భౌగోళిక గుర్తింపు (జీఐ ట్యాగ్)కూడా సాధించాయని తెలిపారు. చేనేత రంగ కార్మికులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కొత్త పథకాలు



చేనేత ఫ్యాషన్ షోలో పాల్గొన్న విద్యార్థినిలు

అమలు చేయడం జరుగుతుందని ఇందులో థ్రిఫ్ట్ ఫండ్, పావలవడ్డీ పథకాల కింద రుణాలు అందించడం జరుగుతుందన్నారు. జిల్లాలో చనిపోయిన 10 మంది నేత కార్మికుల కుటుంబాలకు చేయూత అందించేందుకు చేనేత భీమ పథకం క్రింద రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత రంగాభివృద్ధికి విశేష కృషి చేస్తుందన్నారు. మీరు చూడాలని కోరుకునే మార్పుకు మీరు స్వయంగా మారాలి అనే గాంధీజీ వాక్యాన్ని ఉదహరిస్తూ, ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించి మాటలకంటే చేతల ద్వారా మార్పును చూపించాల్సిన అవసరం ఉందని అన్నారు. చేనేత రంగం భారత స్వాతంత్ర్య పోరాటంలో కూడా కీలక పాత్ర పోషించిందని, ఖాదీ ఉద్యమాన్ని ప్రస్తావించారు. వ్యవసాయ రంగం తరువాత చేనేత రంగం దేశంలో రెండో అతిపెద్ద ఉపాధి మార్గమని అన్నారు. ఈరోజుల్లో పాశ్చాత్య పోకడలు పెరుగుతున్న నేపథ్యంలో, భారతీయ సంప్రదాయమైన చేనేత వస్త్రాలను ప్రోత్సహించడం ఎంతో అవసరమని తెలిపారు. చేనేత వృత్తిలోని నైపుణ్యాన్ని యువత తెలుసుకొని నేర్చుకోవాలని, ప్రజలంతా చేనేత వస్త్రాలు ధరించి, అవగాహన పెంచితే చేనేత రంగాన్ని



చెక్కులను అందజేస్తున్న జిల్లా కలెక్టర్

కాపాడిన వారమవుతామని పేర్కొన్నారు. అంతకుముందు కలెక్టర్ కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన గద్వాల చీరల స్టాళ్లను ప్రారంభించి, వాటి ప్రత్యేక డిజైన్లను చూసి స్థానిక చేనేత ఉత్పత్తుల్ని అభినందించారు. అనంతరం చేనేత వృత్తిలో నైపుణ్యం పొందిన చేనేత కార్మికులను, ఫ్యాషన్ షోలో పాల్గొన్న విద్యార్థినిలను,వివిధ పాఠశాలలు కళాశాలల్లో వ్యాసరచన, ఉపన్యాస పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఈ సందర్భంగా మేమెంటోలు, సర్టిఫికెట్లతో ఘనంగా సన్మానించారు. చేనేత కార్మికులకు 6.05 లక్షల రూపాయల పావలవడ్డీ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీ నారాయణ, నర్సింగ రావు, చేనేత, జౌలి శాఖ సహాయ సంచాలకులు గోవిందయ్య, ఉప సంచాలకులు నాగలత, సహాయ సంచాలకులు భిక్షపతి, జెడ్పీ సిఈఓ కాంతమ్మ, జిల్లా అధికారులు, చేనేత కార్మికులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.